క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

తాళ్లూరు: మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అధ్యక్షత నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

మార్కాపురంలో కూడా..
మార్కాపురం టౌన్: మార్కాపురం మండల పరిషత్ సమావేశం బుధవారం నిర్వహిస్తునట్లు ఎంపీపీ పి. అరుణ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

పెన్షనర్లతో ఈకేవైసీ చేయించండి

మార్కాపురం: మార్కాపురం ట్రెజరీ పరిధిలోని రిటైర్డ్ పెన్షనర్స్ తప్పనిసరిగా ఈకేసీవైసీ చేయించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ ఐ. బాలసుబ్బరావు, పి. జయరావు మంగళవారం తెలిపారు. ఈకేవైసీ ట్రెజరీ కార్యాలయంలోనే చేస్తారని ఆఫీస్‌కు వచ్చేటప్పుడు సీఎఫ్‌యంఎస్ నెంబర్ ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకుని రావాలన్నారు. బయట ఇంటర్నేట్ వారి వద్ద చేయించుకోవాల్సిన పనిలేదని ట్రెజరీ కార్యాలయంలోనే ఉచితంగా చేస్తారని ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

జూన్ 8 నుంచి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం టౌన్: వచ్చే నెల 8 నుంచి 12వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలోని నాయీ బ్రాహ్మణ మాన్యంలో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తునట్లు చైర్మెన్ రావిపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి సి.హెచ్ శివశంఖర్, అదనపు కార్యదర్శి నిట్టూరి వెంకట రమేష్ తెలిపారు. 8న అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 9న ధ్వజారోహణం, అనంతరం శేషవాహనంపై స్వామి వారి దర్శనం, 10వ తేదీన హనుమంత వాహనంతో పాటు స్వామివారి కళ్యాణంతో పాటు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవం


ప్రత్యేక పూజలందుకున్న వీరాంజనేయస్వామి

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లెలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వేదపండితులతో అభిషేకాలు, ఆకుపూజ, శాంతి హోమం చేశారు. గ్రామ మహిళలు సామూహిక నైవేద్యం చేసి స్వామి వారికి అర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. మంగళవారం రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

3వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలకు 2023–2024 విద్యా సంవత్సరానికి మూడో తరగతిలో 30 సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగేశ్వరావు తెలిపారు. 4వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన బ్యాక్ లాగ్ సీట్ల (గిరిజన విద్యార్థులకు మాత్రమే) కోసం ప్రవేశానికి సైతం అసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం 94413 34392 నంబర్‌ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

డెంగీతో జాగ్రత్తగా ఉండాలి



మార్కాపురం ర్యాలీ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది


కంభంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

మార్కాపురం: డెంగీ జ్వరం పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎం హెచ్‌ఓ డాక్టర్ కె. రాహుల్ అన్నారు. మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. దోమలు కుట్టకుండా, పుట్టకుండా, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. టైగర్ దోమల ద్వారా డెంగీ జ్వరం వస్తుందన్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాల, కీళ్ళ నొప్పులు శరీరంపై దుద్దర్లు, కళ్ళు, ముక్కులో నుంచి రక్తస్రావం వస్తే వెంటనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లో చెక్ చేయించుకోవాలని సూచించారు. ఇంటిలో నీళ్ళు నిల్వ చేసే పాత్రల పై ముతలు పెట్టాలని, తాగి పారేసిన కొబ్బరి బోండాలు, ప్లాస్టిక్ గ్లాసులు, వాడని రోళ్ళు, పాత టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో పొదీన, తులసి, రోజ్‌మేరీ, లావెండర్ వంటి మొక్కలను పెంచుకోవాలన్నారు. కిటికీలకు, సెప్టిక్ ట్యాంక్‌కు మెష్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డాక్టర్లు శ్రావణ్ తేజ, హర్షవర్ధన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: దోమల నివారణ కోసం అందరం కలిసికట్టుగా ప్రయత్నించాలని నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణయ్య అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమలతో డెంగీ, మలేరియా, చికున్ గున్యా, వంటి వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయన్నారు. దోమల నివారణ కోసం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జాతీయ డెంగీ దినోత్సవ కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం పట్టణంలోని పలు వీధుల్లో ర్యాలీ చేశారు. కె.ఎస్.పల్లె వైద్యాధికారి నాయబ్ రసూల్, అర్బన్‌హెల్త్ డాక్టర్ భార్గవ్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి, సబ్ యూనిట్ ఆఫీసర్ రంగనాయకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది గిరిధర్ యాదవ్, మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

కంభంలో...
కంభం : స్థానిక ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ శివనాయక్ ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు డెంగీ వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నాలుగు రకాల డెంగీ వైరస్ వల్ల ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. డాక్టర్ పృధ్వీరాజ్, సీహెచ్‌ఓ హబీబ్‌ఖాన్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

తాళ్లూరు: పరిసరాల పరిశుభ్రత పాటించి దోమల నివారణకు అంతా సహకరిస్తే డెంగీని నివారించవచ్చని తూర్పుగంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి బి.రత్నం అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి రత్నం మాట్లాడుతూ డెంగీ నివారణకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ నిర్ధారణ పరీక్షలు ఉన్నట్లు చెప్పారు. అనవసరంగా ఆందోళన చెంది రూ.లక్షల్లో ఖర్చు పెట్టుకోవద్దని చెప్పారు. వైద్యురాలు మౌనిక, హెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, పీహెచ్‌ఎన్ మస్తానమ్మ, హెచ్‌వీ సుశీల, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని పెదన్నపాలెం సచివాలయం వైద్య సిబ్బంది మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఏఎన్‌ఎం కృష్ణ కుమారి డెంగీ వ్యాధి లక్షణాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ చేశారు. డెంగీ నివారిద్దాం.. దోమలను నిర్మూలిద్దాం..అంటూ వ్యాధులు తరిమి కొడదాం..దోమ కాటు వద్దు..దోమ తెర ముద్దు..దోమ కుట్టరాదు.. దోమలపై దండ యాత్ర చేద్దాం..ఆరోగ్యంపై జైత్రయాత్ర చేద్దాం.. అంటూ నినాదాలు చేశారు. సర్పంచ్ మిందాల నాగయ్య, సచివాలయం సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొదిలి: కమ్యూనిటీ వైద్యశాల, ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగీ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత, దోమకాటు వద్దు అంటూ ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఎంపీడీఓ శ్రీకృష్ణ, ఈఓఆర్‌డి రాజశేఖర్, డాక్టర్ సుష్మ, ఎస్‌యూఓ బ్రహ్మనందం, సూపర్‌వైజర్లు ఎస్. శ్రీనివాసరెడ్డి, జె.వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులపై అధికారుల సమావేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి ఆలయ అభివృద్ధి పనులపై దేవదాయ ధర్మాదాయ శాఖ, ఆటవీ అధికారులతో మంగళవారం ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెమలిగుండ్లరంగనాయకస్వామి ఆలయం సమీపంలో పలు అభివృద్ధి పనులకు తిరుమల, తిరుపతి దేవస్థానం, దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.4 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఆ నిధులతో అభివృద్ధి పనులపై అధికారులతో ఎమ్మెల్యే చర్చలు జరిపారు. ఆలయ అభివృద్ధి పనులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. అధికారులు చొరవ తీసుకుని ఆలయాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కోరారు. కర్నూలు, గుంటూరు, ప్రకాశం జిల్లాల దేవదాయ శాఖ అధికారులు సతీష్, జనార్దన్‌రావు, దివ్య, గిద్దలూరు డీఎఫ్‌వో వై.నరసింహరావు, నెమలిగుండ్లరంగనాయకస్వామి దేవస్థానం చైర్మన్ కన్నసాని చిన్న ఓబులేసు, కార్యానిర్వహణాధికారి ఈదుల చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళి, వైఎస్సార్ సీపీ నాయకుడు పగడాల శ్రీరంగం పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయండి


కృష్ణ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తర్లుపాడు: మండలంలో వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సోదరుడు కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తర్లుపాడులో ఆయన పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని, గ్రామ స్థాయి నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి గడపకు అందిస్తున్న సంక్షేమ పథకాలను స్వయంగా ఇంటింటికీ వెళ్ళి వివరించాలని సూచించారు. వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ఎప్పటికప్పుడు అర్హులైన లబ్ధిదారులుంటే తెలుసుకొని ప్రభుత్వ పథకాల కోసం సచివాలయానికి తీసుకోని వెళ్ళి దరఖాస్తు చేయించాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు, పలువులు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం


భూహక్కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే అన్నా

కొమరోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటూ వారి కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటోందని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని నల్లగుంట్ల గ్రామ సచివాలయంలో మంగళవారం రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా జి.మొరాయిపల్లె రెవెన్యూ ఇలాకాలోని రైతులు 65 మంది భూయజమానులకు పట్టాలు ఎమ్మెల్యే అన్నా అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 120 ఏళ్ల తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయంతో భూవివాదాలకు ముగింపు పలికేందు కోసం భూఆక్రమణలు తొలగించేందుకు, అక్రమ రిజిస్ట్రేషన్లు, లంచాలకు తావు లేకుండా చేసేందుకు జగనన్న శాశ్వత భూహక్కు పథకం తీసుకొచ్చారన్నారు. భూహక్కుదారులకు శాశ్వత పరిష్కారం లభిస్తోందన్నారు. దేశచరిత్రలో ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయం ఎవరూ తీసుకోలేదని, బ్రిటీష్ కాలంలో నిర్ణయించిన సర్వేలతోనే రెవెన్యూ రికార్డులు ఉన్నాయని, ఆర్థిక భారం ఉన్నా వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి సాహసోపేతమైన నిర్ణయం ముఖ్యమంత్రి తీసుకున్నారన్నారు. శాశ్వత భూహక్కు పత్రాలు పొందిన రైతులందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలపాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకటనాయుడు, సర్పంచ్ గుడిపాటి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ రమాదేవి, డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఇబ్రహీం పాల్గొన్నారు.

కమనీయం ఆంజనేయస్వామి కల్యాణం


కల్యాణాన్ని తిలకిస్తున్న మహిళలు

కొనకనమిట్ల: హనుమాన్ జయంతి, అభయ వీరాంజనేయస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఆంజనేయస్వామి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వేడుకగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సువర్చలా సహిత అభయ వీరాంజనేయస్వామి కల్యాణం భక్తుల కోలాహలం నడుమ వైభంగా నిర్వహించారు. స్వామివారికి గ్రామ పెద్దలు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మధ్యాహన్నం అన్నదానం, రాత్రికి స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు.

ఇష్టంతో చదువుకుని అభివృద్ధి చెందాలి

దర్శి: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా ఉన్న వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఇష్టంతో చదువుకుని అభివృద్ధి చెందాలని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు సభ మంగళవారం నిర్వహించారు. రాజేష్ చౌదరి మాట్లాడుతూ అగ్రి సెంటర్లో ప్రతి ఒక్కరూ సీటు సాధించి మంచి స్థితిలో ఉండాలన్నారు. ఆటల పోటీల విజేతలకు షీల్డ్‌లు అందజేశారు. శాస్త్రవేత్త ఎల్.రాజేష్ చౌదరి, ప్రియాంక, కాశీవిశ్వనాథ్ పాల్గొన్నారు.

నేడు చింతలపల్లెలో ఎమ్మెల్యే పర్యటన

కొమరోలు: గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం చింతలపల్లెలో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు తెలిపారు. చింతలపల్లె గ్రామ సచివాలయం పరిధిలో ఉదయం 10 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఆధ్వర్యంలో చేపడతారని, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని ఆయన కోరారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పొదిలి రూరల్: మండలంలోని ఆముదాలపల్లిలో బుధవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనరు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. పొదిలి మండలంలోని వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, గ్రామ, వార్డు కమిటీ అధ్యక్షులు, సచివాలయాల కన్వీనర్లు, పార్టీ అనుబంధ కమిటీ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


విత్తనాల షాపులు తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీ నాయక్

రాచర్ల: నకిలీ విత్తానాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయ శాఖ గిద్దలూరు ఏడీఏ డి.బాలాజీ నాయక్ హెచ్చరించారు. మండలంలోని అనుములపల్లె, రాచర్ల గ్రామాల్లో విత్తానాల షాపులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విత్తనాల స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాలను పరిశీలించారు. రైతులకు విత్తనాలు అమ్మిన సమయంలో తప్పనిసరిగా బిల్లులు అందజేయాలని వివరించారు. బిల్లులు లేకుండా పురుగుమందులు, విత్తనాలను రైతులకు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేసుకోవాలని వివరించారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


యోగా నేర్పుతున్న భారతి

మార్కాపురం టౌన్: విద్యార్థి దశ నుంచే యోగా నేర్చుకోవాలని యోగా టీచర్ భారతి అన్నారు. మార్కాపురంలోని శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పాల్గొంటున్న విద్యార్థులకు యోగాసానాలు కూడా నేర్పిస్తున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ యోగా చేయడం వల్ల శారీర, మానసిక వికాసం వస్తుందన్నారు. గ్రంథ పాలకులు జీవీ శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజూ విద్యార్థులకు కథలు చెప్పించుట, చదివించడంతో పాటు భారతం, రామాయణంలోని విశేషాలు కూడా తెలుపుతున్నట్లు చెప్పారు. సచివాలయ మహిళ పోలీస్ శిరిష బాలుల హక్కులు థాధ్యతల గురించి తెలిపారు. జూన్ 11 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

బీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

గిద్దలూరు రూరల్: బీఆర్ఎస్‌ను గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట సుబ్బారావు అన్నారు. స్థానిక వితాసుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తొలుత బీఆర్ఎస్ కార్యకర్తలు కంభం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశానికి హాజరయ్యారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుమలరాయుడు పాల్గొన్నారు.

జెండాలు దహనం
కొమరోలు: మండల కేంద్రంలో బీఆర్ఎస్ జెండాలను ప్రజలు తగలబెట్టారు. నియోజకవర్గ కేంద్రం గిద్దలూరులో మంగళవారం బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి తోట సుబ్బారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం రాత్రి కొమరోలులో రహదారి వెంట జెండాలు ఏర్పాటు చేశారు. వాటిని స్థానిక ప్రజలు రహదారిపై తగలబెట్టారు.


రాములవీడు ఎస్సీ కాలనీలో మహిళకు పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

జనం గడపకు జగన్ సర్కార్!

పొదిలి రూరల్: సంక్షేమం..అభివృద్ధి లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. మంగళవారం పొదిలి పట్టణం సచివాలయం–6 పరిధిలోని మంగలి కాలనీ, టైలర్స్ కాలనీలో, సాయంత్రం రాములవీడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పాలనపై ప్రజలకు వివరించడంతో పాటు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగారు. ఎవరిని కదిలించినా సంక్షేమ పథకాల వల్ల నూరు శాతం సంతృప్తి చెందుతున్నామని తెలిపుతున్నారన్నారు.

దేశంలో ఎక్కడ లేని విధంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలును అమలు చేస్తున్నామని చెప్పారు. స్థానిక నాయకులు పొన్నుపాటి శ్రీనివాసరెడ్డి, ఇనగనూరి వెంకటేశ్వరరెడ్డి, యేటి ప్రసాదు అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, బాణ సంచా కాల్చుతూ స్వాగతం పలికారు. గ్రామానికి చెందిన రైతు ఎడ్లతో పందెపు బండ లాగించారు. ఈఓఆర్డీ రాజశేఖర్, పీఆర్ఏఈ మస్తాన్, గ్రామీణ నీటి సరఫరా ఏఈ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి శేషయ్య, నాయకులు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మాదాలవారి పాలెం సొసైటీ అధ్యక్షుడు కొత్తపుల్లి బ్రహ్మారెడ్డి, శాంసన్, సర్పంచ్ శిరిమల్లె శ్రీనివాసులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందచేస్తున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

● ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

కొమరోలు: గ్రామాల్లో ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యుడు అన్నా వెంకట రాంబాబు అన్నారు. మండలంలోని నల్లగుంట్ల, అయ్యవారిపల్లె గ్రామాల్లో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గడప గడపకు తిరుగుతూ మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పథకాలు, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్న అమలు చేస్తున్న నాడు–నేడు, అమ్మఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, విద్యాకానుక, పేదలందరికీ ఇళ్లు, సచివాలయ వ్యవస్థ వంటి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. మూడున్నరేళ్ల పాలనలో ఒక్కో కుటుంబానికి అధిక మొత్తంలో లబ్ధి చేకూర్చడం చరిత్రలో తొలిసారిగా జరుగుతోందన్నారు. అవినీతికి తావు లేకుండా ఆదర్శవంతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, నల్లగుంట్ల సర్పంచ్ గుడిపాటి ప్రదీప్, నల్లగుంట్ల ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బాదం వేణుగోపాల్, వెంకటరెడ్డి, రాజేష్, గుడిపాటి ప్రసాద్, రమణ, సచివాలయ కన్వీనర్ శ్రీనివాసులు, ఎంపీడీవో నరసయ్య, ఎంఈవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

కంభం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. ఎంపీటీసీ రఫీ, కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీంలు మాట్లాడుతూ మూడేళ్లుగా కంభంలో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. లో ఓల్టేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ నేలపై కూర్చుని నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది పనితీరు సక్రమంగా లేదని సర్పంచి బోడయ్య తెలిపారు. చిన్న కంభంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, ట్యాంక్ నిర్మాణపు పనులు నాసిరకంగా జరుగుతున్నాయన్నారు.

కంభం, కందులాపురం పరిసరాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, వాటిని నివారించాలని కోరారు. ఎంపీడీఓ నరసయ్య, తహసీల్దార్ రవి, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.